

## అక్రమ వలసదారుల ఘర్ వాపసీ

### ట్రంప్ బహిష్కరణతో అమెరికా నుంచి స్వదేశానికి

ఢిల్లీ: అమెరికా నుంచి మన దేశానికి చెందిన 12 మంది అక్రమ వలసదారులతో కూడిన నాలుగో విమానం ఆదివారం ఢిల్లీ చేరుకుంది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటివరకు 344 మంది భారతీయులను నాలుగు విమానాల్లో స్వదేశానికి పంపారు.




# బెళగావిపై మళ్లీ భగ్గు

## కర్ణాటక, మహారాష్ట్ర మధ్య మళ్లీ రాజుకున్న వివాదం

- కేఎస్ ఆర్టీసీ కండక్టర్‌పై దాడితో పెరిగిన ఉద్రిక్తతలు
- రెండు రాష్ట్రాల మధ్య నిలిచిన బస్సు సర్వీసులు

బెంగళూరు/ ముంబై, ఫిబ్రవరి 23: 'బెళగావి'పై కర్ణాటక, మహారాష్ట్ర మధ్య మళ్లీ చిచ్చు రేగింది. రెండు రాష్ట్రాల మధ్య ఏండ్లుగా నడుస్తున్న సరిహద్దు వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. మరాఠీలో బదులివ్వనందుకు శుక్రవారం బెళగావిలో కర్ణాటకకు చెందిన ఓ కండక్టర్‌ను చితకబాదారు. ఇందుకు ప్రతిగా శనివారం కర్ణాటకలోని చిత్రదుర్గలో మహారాష్ట్రకు చెందిన కండక్టర్‌పై కొందరు దాడి చేసి, నల్ల రంగు పూశారు. ఈ రెండు దాడులతో రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. ముందు జాగ్రత్త చర్యగా ఇరు రాష్ట్రాల మధ్య బస్సు సర్వీసులను నిలిపివేశారు.

**అసలేం జరిగింది?**

బెళగావిలో శుక్రవారం కర్ణాటక కండక్టర్‌పై జరిగిన దాడి తాజా ఉద్రిక్తతలకు కారణమైంది. ప్యాసింజర్‌కు మరాఠీలో బదులివ్వనందుకు కొందరు కండక్టర్‌పై దాడి చేశారు. కండక్టర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఓ బాలిక తనకు టికెట్ కావాలని మరాఠీలో అడిగింది. అయితే తనకు మరాఠీ రాదని, కన్నడలో చెప్పాలని కండక్టర్ చెప్పడంతో బాలిక, ఆమెతో పాటు వచ్చిన వ్యక్తి తనపై దాడి చేశారని కండక్టర్ తెలిపారు. ఈ క్రమంలో కొందరు బస్సును ఆపి, కండక్టర్‌పై దాడి చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. ఘటనకు సంబంధించి నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కండక్టర్‌పై కూడా పోక్సో కేసు నమోదైంది. తనపై అనుచితంగా ప్రవర్తించారని బాలిక ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు ప్రతీకార చర్యగా కర్ణాటకలోని చిత్ర దుర్గ జిల్లాలో మహారాష్ట్రకు చెందిన కండక్టర్‌పై కొందరు దాడి చేసి ఇంకు పూశారు. ఘటనకు సంబంధించి పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు.



బెళగావి జిల్లా అథనిలో ఎంఎస్ఆర్టీసీ బస్ ముందు కన్నడ రక్షణ వేదిక సభ్యుల నిరసన

**బస్సు సర్వీసుల నిలిపివేత**

కండక్టర్‌పై దాడి ఘటన నేపథ్యంలో కర్ణాటకకు బస్సు సర్వీసులను నిలిపివేస్తున్నట్టు మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించారు. బెంగళూరు నుంచి ముంబై వెళుతున్న బస్సుపై చిత్రదుర్గలో కొందరు దాడి చేశారని చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం మహారాష్ట్రలో కర్ణాటక బస్సుపై దాడి జరిగింది. బస్సుపై జై మహారాష్ట్ర, జై మరాఠీ, జై నవనిర్మాణ సేన అంటూ నినాదాలు రాశారు. ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో మహారాష్ట్రకు సర్వీసులను తగ్గిస్తున్నట్టు కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, దీనిపై ఎప్పటికప్పుడు మహారాష్ట్ర అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఒక ఉన్నతాధికారి తెలిపారు.



### బెళగావిలో మరాఠీల ఆధిపత్యం

బెళగావి ప్రాంతం కర్ణాటకలోనే ఉన్నప్పటికీ ఇక్కడ మరాఠీల సంఖ్య అధికంగా ఉంటుంది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు సమయంలో బెళగావితోపాటు, పలు సరిహద్దు గ్రామాలను తప్పుగా కర్ణాటకకు అప్పగించారని మహారాష్ట్ర వాదిస్తున్నది. అయితే దీనిని కర్ణాటక ప్రభుత్వం తిరస్కరిస్తూ వస్తున్నది. ఆ ప్రాంతం తమదే అని గట్టిగా చెప్పేందుకు ఆ ప్రభుత్వం అక్కడ సువర్ణ విధాన సౌధను నిర్మించి ఏడాదికి ఒకసారి శాసనసభ సమావేశం నిర్వహిస్తున్నది. 1966లో మహాజన్ కమిషన్ కర్ణాటకకు అనుకూలంగా రూలింగ్ ఇచ్చింది. అయితే ఈ నిర్ణయాన్ని తిరస్కరించిన మహారాష్ట్ర సర్కారు.. 2004లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అప్పటి నుంచి కేసు పెండింగ్‌లో ఉన్నది.

## జూన్ 26న విద్యుత్తు ఉద్యోగుల సమ్మె

### ప్రైవేటీకరణపై నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: విద్యుత్తు రంగం ప్రైవేటీకరణను నిరసిస్తూ జూన్ 26న దేశ వ్యాప్త సమ్మెకు అఖిల భారత పవర్ ఇంజినీర్ల సమాఖ్య(ఏఐపీఈఎఫ్) ఆదివారం పిలుపునిచ్చింది. విద్యుత్తు ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమన్వయ కమిటీ(ఎన్‌సీసీఓఈఈఈ) దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిందని ఏఐపీఈఎఫ్ తెలిపింది. జూన్‌లో జరిగే సమ్మెను విజయవంతం చేయడానికి ఏప్రిల్, మేలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో భారీ సదస్సులు నిర్వహించాలని ఎన్‌సీసీఓఈఈఈ నిర్ణయించింది. యూపీలో విద్యుత్తు రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగు భారీ ర్యాలీలనూ నిర్వహించాలని నిర్ణయించింది. ప్రైవేటీకరణ వల్ల వినియోగదారులపై అధిక చార్జీల భారం పడుతుందని సమావేశం పేర్కొంది.

## ఢిల్లీ శాసనసభ ప్రతిపక్ష నేతగా ఆతిశీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా మాజీ ముఖ్యమంత్రి, కల్కాజీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆతిశీని ఆప్ ఎమ్మెల్యేలు ఆదివారం ఎన్నుకున్నారు. పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్న ఈ సమావేశానికి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా హాజరయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలు అందరూ ఆతిశీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆప్ ఢిల్లీ విభాగం కన్వీనర్ గోపాల్ రాయ్ విలేకరులకు తెలిపారు. సభలో బలమైన ప్రతిపక్షం పాత్ర ఎలా ఉండనున్నదో తాము చూపిస్తామని ఆతిశీ చెప్పారు. ఢిల్లీ మహిళలకు నెలకు రూ. 2,500 వాగ్దానం అమలయ్యేలా పోరాడతామని ఆమె అన్నారు.

## గత వారం ఏం పనులు చేశారో చెప్పండి

### అమెరికా ప్రభుత్వ ఉద్యోగులకు మస్క్ 48 గంటల డెడ్‌లైన్

న్యూయార్క్: గత వారం ఏం పనులు చేశారో చెప్పాలని డోజ్ అధిపతి ఎలాన్ మస్క్ 48 గంటల డెడ్‌లైన్ విధించడం వేలాది అమెరికా ఫెడరల్ ఉద్యోగులను అయోమయంలో పడేసింది. 'అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు ఫెడరల్ ఉద్యోగులందరికీ త్వరలోనే ఒక ఈమెయిల్ వస్తుంది. దీనికి స్పందించడంలో విఫలమైనవారు రాజీనామా చేసినట్టు పరిగణిస్తాం' అని మస్క్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ మెయిల్ వచ్చిన కొద్ది సేపటికే ఉద్యోగులందరికీ గత వారం పనుల గురించి అయిదు బుల్లెట్ పాయింట్లలో వివరించాలని.. సీసీ కాపీ మేనేజర్‌కూ పంపాలని.. సోమవారం అర్ధరాత్రి 11.59లోగా ఈ పని చేయాలని ఈ మెయిల్ వచ్చింది. మస్క్ నుంచి వచ్చిన ఈ అసాధారణ ఆదేశం జాతీయ వాతావరణ సేవల విభాగం సహా పలు శాఖల్లో గందరగోళాన్ని సృష్టించింది. మస్క్ అల్టిమేటం ఇవ్వడాన్ని అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు ఎవరెట్ కెల్లీ వెంటనే ఖండించారు. ఫెడరల్ ఉద్యోగుల పట్ల, అమెరికన్లకు కీలక సేవలందించే విభాగాల పట్ల మస్క్, ట్రంప్ అసహ్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సామర్థ్య విభాగాధిపతిగా మస్క్ నియమితులైనప్పటి నుంచి వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులను బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు.




## తమిళ నాడులో ముదిరిన భాషా వివాదం

### రైల్వే స్టేషన్లలో హిందీ పేర్లకు నల్లరంగు

పొల్లాచి(తమిళనాడు): కేంద్రం తమపై హిందీ భాషను బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తోందని అధికార డీఎంకే ఆరోపిస్తున్న నేపథ్యంలో తమిళనాడులో ఆదివారం రెండు రైల్వే స్టేషన్ల వద్ద నేమ్ బోర్డులపై ఉన్న హిందీ అక్షరాలపై నల్ల రంగు పూసి తమిళ భాషాభిమానులు తమ నిరసన తెలిపారు. పొల్లాచి జంక్షన్ అని రాసి ఉన్న హిందీ అక్షరాలపై తమిళ భాషాభిమానులు నల్ల రంగు పూస్తున్న వీడియో ఒకటి ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. వెంటనే స్పందించిన అధికారులు దీన్ని సరిచేశారు. నిందితులపై కేసు నమోదైంది. మరో సంఘటనలో పాలయన్‌కోట్టై రైల్వే స్టేషన్‌లోని నేమ్ బోర్డుపై ఉన్న హిందీ అక్షరాలను నలుపు చేసిన డీఎంకే కార్యకర్తలపైనా రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్ఈపీ అమలుపై తమిళనాడు, కేంద్రం మధ్య వివాదం నడుస్తున్నది.

## కేరళ కాంగ్రెస్‌లో ముసలం

- నన్ను విస్మరిస్తే నాకూ వేరే ఆప్షన్లు ఉన్నాయి
- పార్టీ హైకమాండ్‌కు ఎంపీ శశి థరూర్ హెచ్చరిక



కొచ్చి: ప్రధాని మోదీని, కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని పొగడటం వివాదాస్పదమైన నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందించారు. తాను ఇప్పటికీ పార్టీకి అందుబాటులోనే ఉన్నానని చెబుతూనే వార్నింగ్ ఇచ్చారు. తన అవసరం లేదని పార్టీ భావిస్తే తనకూ వేరే ఆప్షన్లు ఉన్నాయని హెచ్చరించారు. ఈ మేరకు 'ఐఈ మలయాళం' పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడారు. కేరళ ప్రభుత్వ స్టార్టప్ పాలసీని, ప్రధాని మోదీ యూఎస్ అధ్యక్షుడు ట్రంప్‌ను కలవడంపై ఇటీవల తన ఆర్టికల్‌లో శశిథరూర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వివాదంపై ఆయన స్పందించారు. 'కేరళ కాంగ్రెస్‌లో నాయకత్వ శూన్యత ఉంది. ఈ విషయమై నా అభిప్రాయాలను పార్టీ ఇతర నేతలూ సమర్థించారు. కొత్త ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ తన బేస్‌ను విస్తరించాల్సిన అవసరముంది. రాష్ట్ర నాయకత్వ రేసులో నేను అందరికంటే ముందున్నాను. కొన్ని సంస్థల పోల్‌లో ఈ విషయం స్పష్టమైంది. కాంగ్రెస్ తన ప్రాబల్యాన్ని విస్తరించకపోతే వచ్చే ఎన్నికల్లో మూడోసారి ప్రతిపక్షంలోనే కూర్చోవాల్సి వస్తుంద'ని స్పష్టం చేశారు.

## నాణ్యతా పరీక్షల్లో 84 రకాల ఔషధాలు విఫలం

### జాబితాలో మధుమేహ మందులు కూడా: సీడీఎస్‌సీవో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: మార్కెట్లో నకిలీ ఔషధాల అమ్మకాల్ని అడ్డుకునేందుకు నాణ్యత పరీక్షలు నిర్వహించగా, 84 రకాల ఔషధాలు నాణ్యత పరీక్షల్లో విఫలమయ్యాయి. ఆదివారం ఈమేరకు 'సీడీఎస్‌సీవో' (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్) ఒక హెచ్చరిక జారీచేసింది. సాధారణ స్టెరాయిడ్స్, డయాబెటిస్, కొవ్వును తగ్గించే ఔషధాలు, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్‌పై వివిధ కంపెనీలకు చెందిన మందుల్లో నిర్దేశిత ప్రమాణాలు లోపించాయని 'సీడీఎస్‌సీవో' పేర్కొన్నది. 2024 డిసెంబర్‌లో ఆయా కంపెనీల ఔషధాల నమూనాలపై పరీక్షలు జరిపామని, దీంట్లో 84 రకాల ఔషధాల బ్యాచ్‌లు 'నాణ్యత లేనివి' (ఎన్ఎస్‌క్యూ)గా గుర్తించినట్టు సీడీఎస్‌సీవో తెలిపింది. నకిలీ ఔషధాల తొలగించడానికి రాష్ట్ర సంస్థల సహకారంతో క్రమం తప్పకుండా పరీక్షలు చేపడుతున్నట్టు పేర్కొంది.

## అవినీతి కేసులపై ప్రాథమిక దర్యాప్తు తప్పనిసరి కాదు

### సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: అవినీతి నిరోధక చట్టం(పీసీఏ) కింద నమోదైన ప్రతి కేసులో ప్రాథమిక దర్యాప్తు తప్పనిసరి కాదని, అది నిందితుడికి కల్పించిన హక్కు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పీసీఏ కింద నమోదయ్యే కేసులతో సహా కొన్ని ప్రత్యేక కేసులలో ప్రాథమిక దర్యాప్తు వాంఛనీయం అయినప్పటికీ క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు ఇది ముందస్తు అవసరం లేదా తప్పనిసరి కాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఫిబ్రవరి 17న వెలువరించిన ఓ కేసు తీర్పునకు సంబంధించి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. ప్రాథమిక దర్యాప్తు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం తమకు అందిన సమాచారంలోని నిజానిజాలను నిర్ధారించుకోవడం కోసం కాదని, అది చట్టప్రకారం నేరమా కాదా అని తేల్చుకోవడం కోసమేనని ధర్మాసనం తెలిపింది. తమకు సమాచారం అందచేసిన వ్యక్తి ఉన్నత అధికారి అయిన పక్షంలో ప్రాథమిక దర్యాప్తు చేయవలసిన అవసరం లేదని కోర్టు పేర్కొంది. 2024 మార్చిలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. పీసీ చట్టం కింద నేరానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఓ ప్రభుత్వ ఉద్యోగిపై కర్ణాటక లోకాయుక్త పోలీసు స్టేషన్‌లో దాఖలైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది.



## నస్రల్లా అంత్యక్రియలకు వేలాది మంది హాజరు

### బీరూట్ గగనతలంలో ఇజ్రాయెల్ యుద్ధ విమానాల చక్కర్లు

బీరూట్: హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ మాజీ చీఫ్ హసన్ నస్రల్లా అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. వేలాది మంది ఆయనకు తుది వీడ్కోలు పలికారు. బీరూట్‌లోని ఓ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘెర్ కలిబఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆరంగ్చి, లెబనాన్ పార్లమెంట్ స్పీకర్, ఆ దేశాధ్యక్షుడి ప్రతినిధులు, ప్రధాన మంత్రి పాల్గొన్నారు. లెబనాన్‌లో ఇంత పెద్ద ఎత్తున అంత్యక్రియలు జరగడం 20 ఏళ్లలో ఇదే మొదటిసారి. హెజ్బొల్లా మాజీ చీఫ్ నస్రల్లా ఇజ్రాయెల్ దాడుల్లో ఐదు నెలల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. ఆయన ఈ ఉగ్రవాద సంస్థకు 30 ఏళ్లకుపైగా నాయకత్వం వహించారు. ఇరాన్ మద్దతుగల ఉగ్రవాద సంస్థల్లో ఆయనకు మంచి పలుకుబడి ఉంది. నస్రల్లా అంత్యక్రియల సమయంలో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బీరూట్ గగనతలంలో చక్కర్లు కొట్టాయి.

## వెస్ట్‌బ్యాంకులో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు


### 2002 తర్వాత మొదటిసారి

జెరూసలెం: ఆక్రమిత వెస్ట్ బ్యాంకు ఉత్తర ప్రాంతంలో ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం మొట్టమొదటిసారి తన యుద్ధ ట్యాంకులను మోహరించింది. 2002లో ఆపరేషన్ డిఫెన్సివ్ షీల్డ్ ప్రారంభించిన తర్వాత ఇజ్రాయెలీ సైన్యం తన యుద్ధ ట్యాంకులను వెస్ట్ బ్యాంకులో మోహరించడం ఇదే మొదటిసారి. ఆ ప్రాంతంలో తమ సైనిక కార్యకలాపాలను బలోపేతం చేసేందుకే ఈ చర్యని ఇజ్రాయెల్ తెలిపింది. ఉత్తర సమరియా(వెస్ట్ బ్యాంకు)లో ఉగ్రవాదాన్ని అణచివేయడం, తమ సైనిక బలాన్ని విస్తరించడం కోసం ఇజ్రాయెల్ రక్షణ దళాలు(ఐడీఎఫ్) తమ కార్యకలాపాలను అక్కడ కొనసాగిస్తున్నాయని ఇజ్రాయెల్ సైన్యం ఎక్స్ వేదికగా ఆదివారం వెల్లడించింది. వెస్ట్ బ్యాంకులోని పాలస్తీనా శరణార్థ శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో యుద్ధ ట్యాంకుల ఆగమనంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఆక్రమిత వెస్ట్ బ్యాంకులోని ఇళ్లు, కట్టడాలను ఇజ్రాయెల్ కూల్చివేస్తుండడంతో వేలాది మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులుగా మారుతున్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా కనీసం 60 మంది ఈ ప్రాంతంలో మరణించారు.

# ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- గంటల వ్యవధిలో 267 డ్రోన్ దాడులు
- ఇరు దేశాల మధ్య యుద్ధానికి నేటితో మూడేండ్లు పూర్తి

మాస్కో, ఫిబ్రవరి 23: ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలై సోమవారంతో సరిగ్గా మూడేండ్లు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఉక్రెయిన్‌లోని వివిధ నగరాలే లక్ష్యంగా ఏకబిగిన వరుసగా 267 డ్రోన్ల వర్షం కురిపించింది. యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌పై ఈస్థాయిలో రష్యా డ్రోన్ దాడులను చేపట్టడం ఇదే మొదటిసారి. ఒకే రోజు రికార్డ్ స్థాయిలో 267 డ్రోన్స్‌ను ఉక్రెయిన్‌పై ప్రయోగించిందని, ఇందులో 138 డ్రోన్లను కూల్చివేసినటట్టు ఆ దేశ వైమానిక దళ అధికార ప్రతినిధి యూరీ ఇగ్నత్ చెప్పారు. రష్యా డ్రోన్ దాడుల్లో ఏమేరకు నష్టం వాటిల్లిందన్న వివరాల్ని ఆయన వెల్లడించలేదు.



కీవ్‌లో రష్యా డ్రోన్లపై కాల్పులు జరుపుతున్న ఉక్రెయిన్ సైన్యం

### నాటో సభ్యత్వమిస్తే పదవిని వదులుకుంటా!

**ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ**

కీవ్, ఫిబ్రవరి 23: ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇస్తే దానికి బదులుగా తక్షణం తన అధ్యక్ష పదవిని వదలుకుంటానని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదివారం ప్రకటించారు. 'ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడానికి, నిజంగా నేను పదవి నుంచి దిగాల్సిన అవసరం వస్తే, నేను సిద్ధం. నాటోలో సభ్యత్వానికి బదులుగా నా పదవిని వదులుకుంటా' అని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. అవసరమైతే తక్షణం అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటానని ఆయన ప్రకటించారు. యూ ఎస్ అధ్యక్షుడు ట్రంప్ తనను అర్థం చేసుకోవాలని, రష్యా దురాక్రమణకు వ్యతిరేకంగా కీవ్ తనను తాను రక్షించుకునేందుకు అవసరమైన గట్టి భద్రతా హామీలను అమలు చేయాలని తాను అమెరికాను కోరుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు.

## జర్మనీలో కన్జర్వేటివ్ అలయన్స్‌దే ఆధిక్యం

బెర్లిన్: జర్మనీ పార్లమెంటు ఎన్నికల్లో ప్రతిపక్ష నేత ఫ్రెడరిక్ మెర్జ్ సారథ్యంలోని కన్జర్వేటివ్ సీడీయూ/సీఎస్‌యూ అలయన్స్‌దే ఆధిక్యమని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. 28-29 శాతం ఓట్లు దక్కవచ్చని పేర్కొన్నాయి. ఫార్ రైట్ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) ఏకంగా 19.5-20 శాతం ఓట్లు దక్కించుకోవచ్చని అంచనావేశాయి. గత ఎన్నికల్లో ఆ పార్టీ సాధించిన ఓట్ల కంటే ఇది రెట్టింపు. ఇక చాన్స్‌లర్ ఓలఫ్ స్కాల్జ్ సెంటర్-లెఫ్ట్ సోషల్ డెమోక్రాట్లు మూడో స్థానానికి పరిమితమవుతారని, కేవలం 16-16.5 శాతం ఓట్లు దక్కించుకోవచ్చని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి.

## జేఈఈ మెయిన్ 2025 పేపర్-2 ఫలితాల విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: జేఈఈ మెయిన్ 2025 పేపర్-2 ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. అభ్యర్థులు తమ దరఖాస్తు సంఖ్య, పాస్‌వర్డ్‌తో స్కోర్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. బీఆర్క్, బీప్లానింగ్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు జేఈఈ మెయిన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాల్ని చెక్ చేసుకోవచ్చునని ఎన్‌టీఏ ప్రకటించింది. బీఆర్క్, బీప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు జనవరి 30న ఎన్‌టీఏ జేఈఈ మెయిన్ పరీక్షలను నిర్వహించింది. దేశవ్యాప్తంగా 291 నగరాల్లో, విదేశాల్లోని 12 నగరాల్లో నిర్వహించిన పరీక్షలకు లక్షలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈనెల 22న ఎన్‌టీఏ తుది కీ విడుదల చేయగా, తాజాగా ఫలితాలను ప్రకటించింది. కాగా తొలి సెషన్‌లో సాధించిన పర్సంటైల్‌తో సంతృప్తి చెందని విద్యార్థులు మెరుగైన స్కోర్ కోసం సెషన్-2 పరీక్షలకు ఫిబ్రవరి 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.


## 1971 తర్వాత పాక్, బంగ్లా మధ్య మళ్లీ ప్రత్యక్ష వాణిజ్యం

ఇస్లామాబాద్: ఉమ్మడి పాకిస్థాన్ 1971లో విడిపోయిన తర్వాత మొదటిసారి పాక్, బంగ్లాదేశ్‌ల మధ్య అధికారికంగా ప్రత్యక్ష వాణిజ్య సంబంధాలు పునః ప్రారంభమయ్యాయి. పాకిస్థాన్ ఖాసిమ్ నౌకాశ్రయం నుంచి బంగ్లాదేశ్‌కు 50 వేల టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేయడానికి అనుమతించడంతో ఈ సంబంధాలు మొదలయ్యాయి. పాక్ వాణిజ్య కార్పొరేషన్ నుంచి ఈ బియ్యాన్ని కొనుగోలు చేయడానికి ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య ఈ నెల మొదట్లో ఒప్పందం కుదిరింది. ఇరు దేశాల నౌకా వాణిజ్యంలో దీన్ని మైలురాయిగా ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పత్రిక అభివర్ణించింది. షేక్ హసీనా పదవి నుంచి దిగిపోయాక బంగ్లా ప్రభుత్వంతో పాకిస్థాన్ సర్కారు చక్కని వాణిజ్య, దౌత్య సంబంధాలు కొనసాగిస్తున్నది.

## ఆసియాను ఢీ కొట్టనున్న ఆస్ట్రేలియా

### ఉత్తర దిశగా కదులుతున్న ఖండం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఆస్ట్రేలియా ఖండం స్థిరమైన భూభాగంలా కనిపిస్తున్నప్పటికీ అది క్రమేణా అనూహ్య వేగంతో ఉత్తర దిశగా ఆసియా ఖండం వైపు కదులుతున్నది. అలా ఏటా 2.8 అంగుళాల (7 సెంటీమీటర్ల) చొప్పున ముందుకు సాగుతున్నట్టు శాస్త్రవేత్తలు వెల్లడించారు. మన గోళ్ల పెరుగుదలకు సమానమైన ఈ వేగం చాలా స్వల్పమైనదే అనిపిస్తున్నప్పటికీ కొన్ని మిలియన్ల సంవత్సరాల తర్వాత గణనీయ భౌగోళిక పరివర్తనకు దారితీసి ఆ ప్రాంత స్వరూపాన్ని, వాతావరణాన్ని, జీవవైవిధ్యాన్ని మార్చేస్తుందని ఈ దృగ్విషయంపై అధ్యయనం చేసిన కర్టిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జెంగ్-జియాంగ్ లీ స్పష్టం చేశారు. మనకు నచ్చినా నచ్చకపోయినా భవిష్యత్తులో ఆస్ట్రేలియా ఖండం ఆసియాను ఢీకొంటుందని తెలిపారు. ఖండాలు విడిపోయి చివరికి మళ్లీ చేరువయ్యే చక్రీయ నమూనాలో ఈ కదలిక ఓ భాగమని పేర్కొన్నారు. దాదాపు 8 కోట్ల ఏండ్ల క్రితం అంటార్కిటికా నుంచి విడిపోయిన ఆస్ట్రేలియా గత 5 కోట్ల సంవత్సరాల నుంచి ఉత్తర దిశగా కదులుతున్నదని వివరించారు.




## అల్ట్రాసౌండ్‌తో ప్రొస్టేట్ క్యాన్సర్‌కు చెక్

### సర్జరీ అవసరం లేదు • పరిశోధకుల వెల్లడి

లండన్: ప్రొస్టేట్ క్యాన్సర్‌పై జరుగుతున్న పరిశోధనల్లో గొప్ప ముందడుగు పడింది. అల్ట్రాసౌండ్ చికిత్సలను ఉపయోగించటం ద్వారా సర్జరీ అవసరం లేకుండా..ప్రొస్టేట్ క్యాన్సర్‌ను సమర్థంగా అడ్డుకోవచ్చునని రైస్ వర్సిటీ, వాండర్‌బిల్ట్ వర్సిటీ పరిశోధకులు నిరూపించారు. క్యాన్సర్ చికిత్సలో వాడుతున్న 'ట్రైల్'కు అల్ట్రాసౌండ్ (ఎఫ్‌యూఎస్)ను చేర్చటం ద్వారా క్యాన్సర్ కణతుల పరిమాణాన్ని తగ్గించవచ్చని వెల్లడించారు. దీనిపై 'అడ్వాన్స్‌డ్ సైన్స్' కథనం ప్రకారం 'ట్రైల్'లో రోగులకు సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువ. ఈ చికిత్సలో రోగి తీవ్రమైన అసౌకర్యానికి గురవుతాడు. ట్రైల్‌కు 'ఎఫ్‌యూఎస్'ను కూడా చేర్చినట్టయితే.. క్యాన్సర్ కణతుల పరిమాణం అనుకున్న విధంగా తగ్గిస్తున్నదని పరిశోధన తేల్చింది. ప్రొస్టేట్ క్యాన్సర్ అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉన్న కేసుల్లో 'అల్ట్రాసౌండ్' పద్ధతి చాలా బాగా పనిచేస్తుందని, క్లినికల్‌గా ఈ కొత్త పద్ధతి వినియోగంలోకి వస్తుందని పరిశోధకులు భావిస్తున్నారు.



## పోలీసులకు మేకప్ క్లాసులు!

### జపాన్‌లో బ్యూటీ కోర్సులు

టోక్యో, ఫిబ్రవరి 23: జపాన్‌లోని ఓ పోలీసు అకాడమీ తమ వద్ద శిక్షణ పొందుతున్న పురుష అధికారులకు బ్యూటీ కన్సల్టెంట్లను పిలిపించి మరీ మేకప్ కళలో శిక్షణ ఇప్పిస్తోంది. ఫుకుషిమాలోని పోలీసు అకాడమీలో ఈ ఏడాది జనవరిలో 60 మంది పోలీసు అధికారులకు మేకప్ కోర్సు ప్రారంభించినట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్టు వెల్లడించింది. ఐబ్రో పెన్సిల్స్ వినియోగం, మాయిశ్చరైజింగ్ స్కిన్, ప్రైమర్లు అప్లై చేయడం వంటి ప్రాథమిక మేకప్ మెళకువలను నేర్పించడంతోపాటు కనుబొమ్మలను ట్రిమ్మింగ్ చేయడం, హెయిర్‌స్టైలింగ్ టెక్నిక్స్‌లో కూడా పోలీసు అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం ప్రముఖ జపనీస్ కాస్మటిక్స్ బ్రాండ్ షిసీడో నుంచి ప్రొఫెషనల్ మేకప్ కన్సల్టెంట్లను పోలీసు అకాడమీకి రప్పిస్తున్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన వారితో పోలీసు అధికారులు మెలగాల్సి ఉంటుంది కాబట్టి వారు నీట్‌గా ఉండాల్సిన అవసరం ఉంటుందని పోలీసు అకాడమీ వైస్ ప్రిన్సిపల్ టకేషీ సుగీరా చెప్పారు. సమాజంలో సభ్యులుగా, భవిష్యత్ పోలీసు అధికారులుగా వారు నీటుగా, అందంగా ఉండాలన్న ఉద్దేశంతోనే మేకప్ శిక్షణ ఇప్పిస్తున్నట్టు ఆయన తెలిపారు.

